క్లుప్తంగా

27వ తేదీ వరకూ గ్రామసభలు



ఎం. కోటపాడులో గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దారు రమాదేవి

మాడుగుల రూరల్: ఎం. కోటపాడు గ్రామ సచివాలయంలో రీసర్వే గ్రామ సభ బుధవారం నిర్వహించారు. రైతుల నుంచి 6 దరఖాస్తులు స్వీకరించారు. స్థానిక తహసీల్దారు రమాదేవి మాట్లాడుతూ ఈ నెల 27 వ తేదీ వరకు ఈ గ్రామ సభలు నిర్వహిస్తామని, వచ్చిన దరఖాస్తులను 15 రోజుల వ్యవధిలో పరిష్కరిస్తామని తెలిపారు. రీసర్వే డీటీ గణపతిరావు, మండల సర్వేయరు జగదీశ్, వీఆర్‌ఓ నారాయణరావు, ఉప సర్పంచ్ గంగాధర్ పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి శంకుస్థాపన



బంగారుమెట్టలో ఆలయ నిర్మాణానికి భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

బుచ్చెయ్యపేట : బంగారుమెట్ట గ్రామంలో వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. స్థానిక షరాబు వీధి దగ్గరలో వీర బ్రహేంద్రస్వామి ఆలయం నిర్మాణానికి గ్రామస్తులు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం ఆలయ శంకుస్థాపనలో ఎమ్మెల్యే రాజు, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ దాసు పాల్గొన్నారు.

కొమళ్లపూడిలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ట



కొమళ్లపూడిలో సాయిబాబా విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న భక్తులు

బుచ్చెయ్యపేట : కొమళ్లపూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయ విగ్రహ ప్రతిష్ట బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులో ఏర్పాటు చేసిన షిర్డీ సాయి బాబా ఆలయంతో పాటు షిర్డీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొమళ్లపూడి, బుదిరెడ్డిపాలెం, రావికమతం, గంటికొర్లాం, పీడీ పాలెం తదితర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన, రాత్రికి ప్రత్యేక భజనలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రాజు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ పాల్గొన్నారు.

90 మందికి ఉచిత కంటి పరీక్షలు



శస్త్ర చికిత్సకు తరలివెళుతున్న కంటి రోగులు

రోలుగుంట : స్థానిక పీఏసీఎస్ వద్ద బుధవారం శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి శిబిరానికి వచ్చిన 90 మంది రోగులకు వైద్యుడు సురేష్ అవసరమైన కంటి పరీక్షలు చేసి, వీరిలో 39 మందిని శస్త్ర చికిత్స కోసం ఎంపిక చేశారు. మిగిలిన వారికి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. శస్త్ర చికిత్స కోసం ఎంపిక చేసిన వారిని క్యాంపు మేనేజర్ ఎం.అరుణ్ కుమార్ ఇక్కడ నుంచి విశాఖకు బస్‌లో తరలించారు. పీఏసీఎస్ సీఈవో మద్దు మహేష్ శిబిరం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసినందుకు క్యాంప్ ఆఫీసర్ కృతజ్ఞతలు తెలిపారు.

వరిలో రెల్లరాల్చు తెగులు

చీడికాడ : ప్రస్తుతం వరిని ఆశిస్తున్న రెల్లరాల్చు తెగులుపై రైతులకు అవగాహన అవసరమని వ్యవసాయాధికారి కృష్ణవేణి తెలిపారు. బుధవారం మండలంలోని ఖండవరం, ఎల్.బి.పట్నం సచివాలయం పరిధిలో గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ మేరకు వరికి ఆశిస్తున్న రెల్లరాల్చు తెగులును గుర్తించి రైతులకు నివారణ చర్యలపై సలహాలందించారు. ఈ తెగులుపై ఎటువంటి సలహాలు సూచనలు కావల్సినా మీ పరిధిలో గల సచివాలయం అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వపిఏలు సాయితులసి, శ్రీవిద్య, రైతులు పాల్గొన్నారు.

కోత కొచ్చిన పంట... చేతికందేనా..!

- ఖరీఫ్ వరికి ఆకురాల్చు పురుగు
- ఆందోళనలో వరి రైతులు
- సస్య రక్షణ చర్యలు అవశ్యం
- లేదంటే దిగుబడిపై ప్రభావం
- మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి



కొవ్వూరులో వరిని ఆశించిన ఊస తెగులు



తెగులుతో పంట భూమిల్లో రాలిన వరి కంకులు



సస్యరక్షణతో వరి పొలాన్ని సంరక్షించుకుంటున్న రైతు

రోలుగుంట : అరుగాలం శ్రమించిన అన్నదాత పండిస్తున్న పంటలపై తెగుళ్ల దాడి వేధిస్తుంది. రుతు పవనాలు, తుపాను ప్రభావంతో కురిసిన అధిక వర్షాలకు బావులు, చెరువులు పూటుగా నిండిపోయాయి. పంట కాలువలు, పంట భూముల్లో బాగా నీరు చేరింది. వ్యవసాయ శాఖ రైతులకు కావాల్సిన 1001, 1061, సోనామసూరి, సాంబ మసూరి, నెల్లూరి సన్నాలు, ఆర్జీఎల్ రకాల విత్తనాలను పంపిణీ చేసింది. దీంతో పల్లం, మెరక అనే భేదం లేకుండా ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాధారణ విస్తీర్ణం 1,342 హెక్టార్లు కాగా 1841 హెక్టార్లలో రైతులు వరి ఆకు వేశారు. తరువాత వాతావరణం అనుకూలించక వరి ఆకు దెబ్బతింది. మరలా రెండవ దఫా ఆకు వేసుకున్నారు. ఆగని వర్షాలకు పాచితెగులు ప్రారంభమయింది. దానిని సస్య రక్షణతో సంరక్షించుకొని నాట్లు వేసినప్పటి నుంచి ఇప్పటి వరకూ భూముల్లో అధిక నీటి నిల్వతో సరైన వాతావరణం లేక పాచితెగులు, పొడ తెగులు, సుడి దోమ కాండం తొలిచే తెగులు దాడి చేసుకుంటూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆర్జీఎల్ వరి రకం పంటను రెల్లు రాల్చు పురుగు ఆశించి రైతును అతలాకుతల చేస్తుంది. తెగుళ్లకు తోడు కేలీల సమస్య తోడయి రైతులకు దిగుబడి బెంగ పట్టుకుంది.

రైతుకు సాయం ఏదీ... : కూటమి ప్రభుత్వం ఏ విధమైన రైతు భరోసా సాయం అందించకపోవడంతో మరింత పెట్టుబడి పెట్టలేక రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పంట చేతికి వచ్చేంత వరకూ అప్పులు చేసే పరిస్థితులు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వంలో నాట్లు, కోతలు, వీటి మధ్యలో మరొకసారి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి రైతు భరోసా సంక్షేమ పథకం నుంచి మూడు దఫాలుగా పంట కోత వరకూ ఆర్థిక సాయం అందేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం హయాంలో హామీలు తప్ప ఒక రూపాయి సాయం కూడా రైతుకు అందలేదు. ప్రభుత్వం రైతు దుస్థితి గమనించి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

తెగుళ్ల నివారణ మందులు సరఫరా చేయాలి



ఈ ఖరీఫ్ సాగులో పంట మదుపు కన్నా తెగుళ్ల నివారణ మందులకే పెట్టుబడి అధికమైంది. వరి ఆకు పోత దగ్గర నుంచి ప్రస్తుత కోత దశ వచ్చేవరకూ పురుగు మందుల వినియోగమే అధికంగా ఉంది. ప్రయివేటు దుకాణాల్లో మందులు కొనుగోలు చేయలేం. ప్రభుత్వమే మందులు సరఫరా చేసి ఆదుకోవాలి.

–అల్లు లక్ష్మణరావు, రైతు, రోలుగుంట

వరుస తెగుళ్లతో నష్టం



నేను ఎకరాన్నర విస్తీర్ణంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు చేపట్టాను. ఆకు పోత నుంచి ప్రస్తుతం కోత దశకు వస్తున్న తరుణం వరకూ పాచి తెగులు, ఆకుముడత, పొడ తెగులు, ఊస తెగులు ఒకదాని తరువాత ఒక తెగులు దాడి చేశాయి. ప్రస్తుతం ఆకురాల్చు పురుగు తాజాగా పంటను ఆశించి పండిన పంటంతా నేలపాలవుతుంది. దీంతో దిగుబడిపై ఆశలు సన్నగిల్లుతున్నాయి.

– రుత్తల పాపయ్యదొర, కౌలురైతు

వరికి గిట్టుబాటు కల్పించాలి



రెండెకరాల విస్తీర్ణంలో వరి సాగు చేపట్టాను. తెగుళ్ల దాడి ఎన్నడూ లేని విధంగా అధిక మయింది. ఆకుపోత, దమ్ములు, గాబులు, ఎరువుల మందుల వినియోగం, తెగుళ్ల మందులకు సుమారుగా ఎకరాకి రూ.19 వేల నుంచి రూ.20 వేలు అయింది. రైతు కష్టాన్ని, పెట్టుబడిని, కూలి రేట్లను దృష్టిలో పెట్టుకొని వరికి గిట్టుబాటు ధర బస్తాకి రూ.2,100 కి పెంచితే కొంత మేలు జరుగుతుంది.

–వ్యాసలపు సూర్యనారాయణ, రైతు

వ్యవసాయ సిబ్బంది సేవలు వినియోగించుకోవాలి

వరి పోలాన్ని సాకుతున్న తెగుళ్లను గుర్తిస్తున్నాం, ప్రస్తుతం ఆర్జీఎల్ వరి పొలంలో రెల్లు రాల్చు పురుగు ఆశించింది. దీనికి ఎకరాకు పెర్మత్రిన్ 400 ఎం.ఎల్. వాడడం ద్వారా గింజ గట్టిబడుతుంది. రెల్లు రాల్చు పురుగుతో పాటు ఆకుముడుత పురుగు నివారణకు క్లోరాంత్రినిలిప్రోల్ 60 ఎం.ఎల్ ఎకరాకు పిచికారి చేయాలి.

– ఎస్.విజయలక్ష్మి, మండల వ్యవసాయాధికారి

వరి పంట పరిశీలించిన ఏవో



సింగన్నదొరపాలెంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏవో సోమశేఖర్

కె.కోటపాడు : రైతులు వాతావరణ పరిస్థితులు గమనించి వరికోతలు చేయాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ సూచించారు. మండలంలో సింగన్న దొరపాలెంలో బుధవారం కోతదశకు చేరుకున్న వరి పంటను ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పరిశీలించారు. కోతలు చేసిన వరి పంట అనుకోని పరిస్థితుల్లో తడిచిన సందర్భంలో పనలపై ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయకుడు ప్రణయ్ భాస్కర్, నారపాటి రవి పాల్గొన్నారు.

అయ్యప్ప, శివస్వాములకు భిక్ష



అయ్యప్ప దీక్షధారులకు అన్న సమారాధన

మాడుగుల రూరల్ : ధర్మశాస్త అయ్యప్ప స్వామి వారికి ప్రీతికరమైన రోజు బుధవారం మాడుగుల గ్రామానికి చెందిన అయ్యప్పస్వామి భక్తులు రాకేటి నూకరాజు అయ్యప్ప, శివమాలాధారణ భక్తులకు భిక్ష (నారాయణసేవ) ఏర్పాటు చేశారు. మాడుగుల షిర్డి సాయి ఆలయంలో గురుస్వామి బొమ్మిశెట్టి శ్రీనివాసరావు స్వామి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 200 మంది భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు అయ్యప్ప పూజలు నిర్వహించారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, కళావతి దంపతులు



గొలుగొండలో పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం : మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ జన్మదిన వేడుకలు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా జరిగాయి. పార్టీ నాయకుల సమక్షంలో మాజీ ఎమ్మెల్యే గణేష్, కళావతి దంపతులు జన్మదిన కేక్ కట్ చేశారు. పార్టీ సీనియర్ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, ఎంపీపీలు గజ్జలపు మణికుమారి, సుర్ల రాజేశ్వరి, సాగిన లక్ష్మణమూర్తి, పార్టీ ఎస్సీ సెల్ మహిళా అధ్యక్షురాలు సుజాత, పట్టణ మహిళా అధ్యక్షురాలు గణమ్మ, మండల పార్టీ అధ్యక్షులు లగుడు నాగేశ్వరరావు, సుర్ల సత్యనారాయణ, రుత్తల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ గిరిబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

పేదలకు రొట్టెలు, పండ్లు పంపిణీ

గొలుగొండ : నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పుట్టినరోజు సందర్భంగా మండలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. గొలుగొండ పీహెచ్‌సీలో వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, గొలుగొండ, కొత్తమల్లంపేట, నాగాపురం సర్పంచ్‌లు కసిపల్లి బుజ్జి, రఘురాం, రాజుబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

'గిరిజనేతరుల పట్టాలు రద్దు చేయాలి'



చేతులు జోడిస్తూ నిరసన తెలుపుతున్న పనసలపాడు గిరిజనులు

రోలుగుంట: రెవెన్యూ అధికారులు కుమ్మక్కై రీసర్వేలో గిరిజనేతరుల పేరిట పట్టాలిచ్చేశారని, వాటిని రద్దు చేయాలని కోరుతూ బుధవారం పనసలపాడులో ఆదివాసీలు చేతులు జోడించి వినూత్నంగా నిరసన తెలిపారు. రెవెన్యూ పరిధిలో 8-1, 6-9, 6-1 సర్వే నెంబర్లలో 12 ఎకరాల జిరాయితీ స్థలం రియల్ ఎస్టేట్ వ్యాపారుల హస్తగతం కావడానికి రెవెన్యూ సిబ్బంది సాయం ఉందని ఆదివాసీలు చిన్నబ్బాయి, రాజు ఆరోపించారు. స్థానికేతరుల పట్టాలను రద్దు చేయాలని, లేకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి



పాల్గొన్న పోలీసు అధికార, సిబ్బందితో సీనియర్ సివిల్ జడ్జి

చోడవరం రూరల్ : వచ్చే నెలలో జరప తలపెట్టిన జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే రీతిలో పోలీసు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా ప్రాధికార సంస్థ చైర్మన్ ఈ.రాజేంద్రబాబు కోరారు. బుధవారం స్థానిక కోర్టుల సముదాయంలో పోలీసు సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 14న జాతీయ స్థాయిలో మెగా లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇరువర్గాలు రాజీ పడడం ద్వారా పరిష్కారం లభించే కేసులను ముందుస్తుగా గుర్తించి ఆయా కేసుల్లోని కక్షిదారులతో సంప్రదించాలని, లోక్ అదాలత్‌లో పరిష్కారానికి ఉన్న చట్టబద్దత, తుది పరిష్కార ప్రత్యేకతల గురించి వారికి అవగాహన కల్పించాలన్నారు. సమావేశానికి హాజరైన కొత్తకోట, కె.కోటపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు జి.కోటేశ్వరరావు, పైడపునాయుడు, ఆయా సర్కిళ్ల పరిధిలోని ఎస్ఐలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వాలాబు రోడ్డును తక్షణం నిర్మించాలి



వాలాబు రహదారిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం మండల కార్యదర్శి దొర తదితర్లు

దేవరాపల్లి : మండలంలోని వాలాబు నుంచి దేవరాపల్లి వెళ్లే రోడ్డు ఛిద్రంగా మారడంతో గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారని, తక్షణమే రోడ్డు నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర డిమాండ్ చేశారు. వాలాబు రహదారిలో స్థానిక గిరిజనులతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాళ్లు తేలడంతో రాకపోకలకు ఆయా గ్రామస్తులు నరకయాతన పడుతున్నారన్నారు. ఇదే రహదారిలో సరియా జలపాతానికి పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉండడంతో శిథిల రహదారిలో వెళ్లినపుడు పలువురు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే వాలాబు నుంచి దేవరాపల్లి వెళ్లే రోడ్డును నిర్మించాలని డిమాండ్ చేశారు. గరిశింగి సచివాలయానికి వెళ్లేందుకు దేవరాపల్లి వచ్చి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని, చింతలపాలెం నుంచి బుచ్చిపాలెం రోడ్డును కలుపుతూ రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పాతబోయిన అప్పలరాజు, దుప్పి నారాయణ, సోమల సింహాచలం, విజయరాజు పాల్గొన్నారు.

మనిషి ఉన్నతి గ్రంథాలయంతో సాకారం



చోడవరం రూరల్ : విజేతలకు బహుమతి అందచేస్తున్న ప్రిన్సిపాల్



చీడికాడ : ప్రముఖుల చిత్రపటాల వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



మాడుగుల రూరల్ : కె.జె.పురం శాఖా గ్రంథాలయంలో విజేతలకు బహుమతులు



బుచ్చెయ్యపేట : గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో



కె.కోటపాడు : చౌడువాడలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న పద్మావతి



మాడుగుల : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ ఎడ్ల కళావతి తదితరులు



నర్సీపట్నం : మాట్లాడుతున్న ఎంఈవో తలుపులు



గొలుగొండ : విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు



రోలుగుంట : విజేతలకు బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం ప్రసాద్, గ్రంథాలయాధికారి వరలక్ష్మి

- ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు
- వివిధ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు

చోడవరం రూరల్ : మనిషి జీవితంలో గ్రంథాలయం ఒక భాగంగా మారినపుడు అతడు ఉన్నత స్థానానికి చేరుకోవడం సులభతరం అవుతుందని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ అన్నారు. కళాశాల గ్రంథాలయం, ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల ఆధ్వర్యంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తృత్వం, క్విజ్, వ్యాస రచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ మాల్యాద్రి, ఎన్ఎస్ఎస్ పీవో పిచ్చమ్మ, సీనియర్ ఉపన్యాసకులు సుధీర్, రఫీయుద్దీన్, అప్పలనాయుడు, సూర్యవతి, కృష్ణారావు పాల్గొన్నారు.

చీడికాడ : గ్రంథాలయాల మనుగడ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్ఐ బి.సతీష్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. గ్రంథాలయాధికారిణి జోగేశ్వరి పాల్గొన్నారు.

నర్సీపట్నం : గ్రంథాలయాలు మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని ఎంఈవో తలుపులు, నాగేంద్ర పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాల విశ్రాంత అధ్యాపకులు జెట్టి ఎల్లమంద మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యం పట్ల విద్యార్థుల్లో అభిరుచి పెంచడానికి గ్రంథాలయాలు తోడ్పడతాయన్నారు. గ్రంథాలయ అధికారిణి దమయంతి, విశ్రాంత హెచ్ఎంసుబ్బారావు, జెడ్పీ స్కూల్ ఉపాధ్యాయులు కె.విజయకుమారి, విశ్రాంత లైబ్రేరియన్ మురళీకృష్ణ, ప్రభాకరరావు, బీడీసీ నిర్వాహకులు నూకరాజు, మంగలక్ష్మి, త్రిమూర్తులరెడ్డి పాల్గొన్నారు.

మాకవరపాలెం : గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపొందుతుందని ఎంఈవో మూర్తి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొలుగొండ : గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గ్రంథాలయ అధికారి రాజుబాబు, ఉపాధ్యాయులు బుధవారం బహుమతులు అందజేశారు. గ్రంథాలయాల గొప్పతనం గురించి విద్యార్థులకు వివరించారు.

కె.కోటపాడు : ప్రతి ఒక్కరూ పుస్తక, పత్రికా పఠనాన్ని అలవాటు చేసుకోవాలని చౌడువాడ గ్రంథాలయాదికారిణి పద్మావతి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం జరిపారు. ఈ నెల 14 నుండి నిర్వహించిన వివిధ క్రీడా, ప్రతిభా పరీక్షలలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్, గుర్తింపు పత్రాలను గ్రంథాలయాదికారిణి పద్మావతి అందించారు. గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాల్లో ఉన్న మేధాసంపత్తిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాడుగుల/మాడుగుల రూరల్ : గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా యువత పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తున్నారని సర్పంచ్ ఎడ్ల కళావతి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, గ్రంథాలయ అధికారి వై. వేంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షుడు శ్రీనువాసరావు, జవ్వాది వరహాలు, రొబ్బా మహేష్ పాల్గొన్నారు. కె.జె.పురం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అటెండెంట్ శృతి ఆధ్వర్యంలో విద్యార్థినులు దేశభక్తి గీతాలు ఆలపించారు. ఆటలు, వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కోటీశ్వరావు, జగ్గారావు, గ్రంథాలయ సిబ్బంది అప్పలనర్సమ్మ పాల్గొన్నారు.

రోలుగుంట : గ్రంథాలయాధికారి వరలక్ష్మి ఆధ్వర్యంలో వారోత్సవాల ముగింపు బుధవారం ఘనంగా జరిగింది.వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, నూకరాజు, ఆర్‌వీఎస్ఆర్ శర్మ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

బుచ్చెయ్యపేట : విద్యార్థులు చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, అందుకు గ్రంథాలయాలు దోహదం చేస్తాయని ఎంఈవో కాశీ విశ్వేరరావు తెలిపారు. బుధవారం వారోత్సవాల ముగింపు సందర్భంగా పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. లైబ్రేరియన్ కృష్ణారావు పాల్గొన్నారు.

కేజీబీవీలో కంప్యూటర్ ల్యాబ్‌కు శంకుస్థాపన

రూ.18.50 లక్షల ఎస్ఎస్ఏ నిధులు మంజూరు



కేజీబీవీలో కంప్యూటర్ ల్యాబ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎస్ఎంసీ చైర్మన్ భారతి

దేవరాపల్లి : మండలంలోని రైవాడ పంచాయతీ శివారు బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కంప్యూటర్ ల్యాబ్ భవనం నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. స్థానిక కేజీబీవీ ఎస్ఎంసీ చైర్మన్ వై.భారతి ప్రత్యేక పూజలు చేసి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కంప్యూటర్ ల్యాబ్ నిమిత్తం సమగ్ర శిక్ష నుంచి రూ. 18.50 లక్షలు నిధులు మంజూరయ్యాయని స్థానిక కేజీబీవీ ప్రిన్సిపాల్ భువన మాధురి స్పష్టం చేశారు. ఈ నిధులతో రెండు గదులు నిర్మిస్తారన్నారు. ఈ ల్యాబ్ నిర్మాణ పనులు పూర్తయితే విద్యార్థులకు కంప్యూటర్ విద్య పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది. కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, కేజీబీవీ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

28న వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల గర్జన



గర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాల సంఘాల నాయకులు

నర్సీపట్నం : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 28న అనకాపల్లిలో జరిగే మాలల గర్జన సభను విజయవంతం చేయాలని దళిత మాల సంఘాల నాయకులు చిట్ల చలపతిరావు, సరమండ వీరబాబు, మార్తి అప్పలరాజు, గాతాడ సహదేవుడు, అల్లంపల్లి ఈశ్వరరావు, కిడారి మల్లేష్ పిలుపునిచ్చారు. అబిద్ సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద మాలల గర్జనకు సంబంధించి వాల్ పోస్టర్లను నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదమ్ముల్లా కలసి మెలిసి ఉంటున్న తమ మధ్య వర్గీకరణ పేరుతో చిచ్చుపెట్టడం సరికాదన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు అనకాపల్లి వేదికగా మాలల గర్జన సభ జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నక్కపల్లి నూకరాజు, బుంగా మాణిక్యం, వరహాలు, నూకరాజు, లోవరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆధార్ సవరణకు ప్రత్యేక శిబిరాలు

మాకవరపాలెం: ఆధార్ అప్‌డేట్ చేసేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో మూర్తి తెలిపారు. విద్యార్థులకు అపార్ ఐడీ నమోదులో భాగంగా విద్యార్థుల ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 19 నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు జరుగుతున్నాయన్నారు. దీనిలో భాగంగా గురువారం మాకవరపాలెం జూనియర్ కళాశాల, కొండల అగ్రహారం, తామరం సచివాలయాల్లోను, శుక్రవారం వజ్రగడ, జి.కోడూరు ఉన్నత పాఠశాలలు, భీమబోయినపాలెం కేజీబీవీ పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలు జరుగుతాయన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

మాడుగుల: ప్రతి విద్యార్థి ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని, ఎంపీడీవో కొంకి అప్పారావు అన్నారు. బుధవారం మండలంలో తాటిపర్తి ఆశ్రమోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రతి విద్యార్థి ఆధార్‌లో తప్పులు దొర్లకుండా జాగ్రతలు తీసుకోవాలని ఆధార్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభా రాణి పాల్గొన్నారు.